ప్రమాదం అంచున ప్రజారోగ్యం

- నిషేధిత టేస్టింగ్ సాల్ట్‌తో జోరుగా ఫాస్ట్‌ఫుడ్ విక్రయాలు
- పట్టించుకోని ఫుడ్ఇన్‌స్పెక్టర్లు



ప్రమాదకర కలర్స్‌తో చేసిన చికెన్



నిషేధించిన టేస్టింగ్ సాల్ట్



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద అమ్మకాలు

పాయకాపురం(విజయవాడరూరల్): వీధి వీధిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నిషేధిత టేస్టింగ్ సాల్ట్‌తో ఆహార పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. విజయవాడ నగర శివారు ప్రాంతాలైన పైపులరోడ్డు, ప్రకాష్‌నగర్, కండ్రిక, రాజీవ్‌నగర్, పాయకాపురం, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో విచ్చలవిడిగా టేస్టింగ్ సాల్ట్‌ను ఉపయోగిస్తున్నారు. అలాగే ఆహార పదార్థాల్లో ప్రమాదకర కలర్స్‌ను వినియోగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పట్టించుకోవడంలేదు. టేస్టింగ్ సాల్ట్‌తో తయారు చేసినవి తినడం వల్ల ఆరోగ్య సమస్యలు కొనితెచ్చుకున్నట్లేనని వైద్యులు చెబుతున్నారు. కానీ నేటి యువతతో పాటు మధ్య వయస్సు వారు కూడా ఫాస్ట్‌ఫుడ్‌ను ఇష్టపడుతున్నారు. బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్‌షాపుల వద్ద వీటి అమ్మకాలు అధికంగా ఉంటున్నాయి. వ్యాపారులు వినియోగదారుల అభిరుచులు, ఆహార అలవాట్లు దృష్టిలో పెట్టుకొని ప్రమాదం అని తెలిసినప్పటికీ టేస్టింగ్ సాల్ట్ వాడుతున్నారు.

కృత్రిమ రంగుల వినియోగం

టేస్టింగ్ సాల్ట్ పలు ప్రాంతాల్లో నిషేధంలో ఉంది. కానీ మన రాష్ట్రంలో యథేచ్ఛగా వాడవచ్చు. అన్ని రకాలకు సంబంధించి న్యూడిల్స్, ఫ్రైడ్‌రైస్‌లో టేస్టింగ్ సాల్ట్ వాడుతున్నారు. దీనితోపాటు చూడగానే ఆకట్టుకునేలా ఆహార పదార్థాలపై కలర్స్ వేస్తున్నారు. ఇది ప్రమాదం అని వినియోగదారునికి, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నిర్వహించే వారికి తెలుసు. కానీ అవి ఏమీ వారు పట్టించుకోవడం లేదు. ఫలితంగా యువత ఆరోగ్యం ప్రమాదం అంచున ఉంది. ఫాస్ట్‌ఫుడ్‌ను అధికంగా పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు కార్మికులు అధికంగా తింటున్నారు. ఫాస్ట్‌ఫుడ్ వినియోగం బాగుండటంతో వీధి వీధిన వాటి సెంటర్లు, బండ్లు దర్శనమిస్తున్నాయి. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, కార్పొరేషన్ అధికారులు ఎవరూ తనిఖీలు నిర్వహించడం లేదు. చేసినా మొక్కుబడిగా తనిఖీలు చేసి ఇలా చేయకండి.. అలా చేయకండి అని చెప్పి మామూళ్లు తీసుకొని వెళుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఒత్తిడి వస్తే నోటీసులు ఇస్తున్నారే తప్ప కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్న దాఖలాలు కనబడవు. ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకొని నగరపాలక సంస్థ అధికారులు టేస్టింగ్ సాల్ట్, ఆహార పదార్థాల్లో కలర్స్ వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్యానికి ప్రమాదం

టేస్టింగ్ సాల్ట్ తీసుకోవడం వల్ల ఊబకాయం వస్తుంది(థైరాయిడ్). ఆడపిల్లలకు పీసీఓడీ వచ్చి నెలసరి సక్రమంగా రాదు. షుగర్, బీపీతోపాటు పలు రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. కావున ఫాస్ట్‌ఫుడ్‌ను తినడం మానేయాలి. అయోడిన్ కలిపిన సాల్ట్‌ను వాడితే ఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ డి.రాథోడ్

తనిఖీలు నిర్వహిస్తున్నాం

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లల్లో తనిఖీలు నిర్వహించి అక్కడ విక్రయిస్తున్న ఆహార పదార్థాలకు పరీక్షలు చేయడం జరుగుతుంది. ప్రజారోగ్యానికి భంగం కలిగించే కృత్రిమ రంగులు, టేస్టింగ్ సాల్ట్ వినియోగిస్తే ఉపేక్షించేది లేదు. నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం. 24/7 నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుంది.

– పూర్ణచంద్రరావు, ఫుడ్ఇన్‌స్పెక్టర్

అన్న క్యాంటీన్లలో నాణ్యత పాటించాలి



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అన్న క్యాంటీన్లలో ఆహార నాణ్యతను నోడల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా పరిశీలించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర తెలిపారు. ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్, హెచ్‌బీ కాలనీ ప్రాంతాల్లో క్యాంటీన్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఆహార నాణ్యతలో ఎలాంటి లోపం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అవసరమైన సదుపాయాల కల్పనలో అధికారులు అలసత్వం వహించొద్దని సూచించారు. ఏవైనా రిపేర్లు వస్తే వెంటనే మరమ్మతులు చేయాలని పేర్కొన్నారు. కిచెన్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యాంటీన్లలో నిరంతరం తాగునీటి సరఫరా ఉండాలని చెప్పారు. వాడుక నీటి పైపులైన్లలో ఎటువంటి లీకేజీ లేకుండా ప్రతినిత్యం పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, చీఫ్ ఇంజినీర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ (వర్క్స్) పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కూటమి ప్రభుత్వానికి చరమగీతం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సూపర్ సిక్స్ అమలు సాధ్యం కాదని చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడే రోజులు త్వరలోనే రాబోతున్నాయని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హామీల అమలు సాధ్యం కాదన్న చంద్రబాబు వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. బాబు ప్రకటనలో మోసం, దగా, వంచన స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. 2014లో ఇలాగే రైతు రుణ మాఫీ చేస్తామని చెప్పి అన్నదాతలను మోసగించారని గుర్తుచేశారు. 2024 ఎన్నికల్లోనూ ఏపీ శ్రీలంక అయిపోయిందని ఓ వైపు గ్లోబల్ ప్రచారం చేస్తూనే.. మరోవైపు సూపర్ సిక్స్ ఇస్తామని గొంతు చించుకున్నారని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కంటే ఎక్కువ పథకాలిస్తామని నమ్మబలికి.. ఈ 8 నెలల కాలంలో ప్రజల జీవన స్థితిగతులను కనీసం పట్టించుకోలేదని ఆరోపించారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబుకు ఏపీ ఆర్థిక పరిస్థితి ఎన్నికల ముందు తెలియదా..? అని ప్రశ్నించారు.

కోవిడ్ సమయంలోనూ పథకాలు ఆపలేదు

2019లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర ఖజానాలో కేవలం రూ.100 కోట్లు మాత్రమే ఉన్నప్పటికీ హామీల అమలులో ఏనాడూ వెనకడుగు వేయలేదని మల్లాది విష్ణు పేర్కొన్నారు. జనాభాలో 10 శాతం లోపే పేదలు ఉండాలన్న లక్ష్యాన్ని నవరత్నాల పథకాల రూపంలో గత ప్రభుత్వం సాధించిందన్నారు. కోవిడ్ సమయంలోనూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేశామని గుర్తుచేశారు. ఐదేళ్లలో డీబీటీ, నాన్–డీబీటీ ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు అక్షరాల రూ. 2,83,866 కోట్ల మేలు చేకూర్చినట్లు వివరించారు.

ఏపీ చరిత్రలో ఇంత తక్కువ కాలంలో వ్యతిరేకత ఎదుర్కొన్న ప్రభుత్వాన్ని చూడలేదని.. చంద్రబాబు చేస్తున్న మోసాలను ఒక్కొక్కటిగా రాష్ట్ర ప్రజలు తెలుసుకుంటున్నారని పేర్కొన్నారు.

31 కల్లా ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయించుకోండి

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ జారీ చేసిన పట్టాలను గజం కేవలం రూ.100తో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు జనవరి 31 ఆఖరి తేదీ అని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాయకాపురం, కొత్త రాజరాజేశ్వరి పేట ప్రాంతాల్లో విజయవాడ నగరపాలక సంస్థ కేటాయించిన పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్లో జరుగుతుందని తెలిపారు. ఇంకా ఇళ్ళ రిజిస్ట్రేషన్లు చేయించుకోవాల్సిన వారంతా జనవరి 31 తేదీ నాటికి ఇంటి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

పొగ పెడుతున్నారు..



సత్యనారాయణపురం రైల్వేకాలనీ బీఆర్టీఎస్ రోడ్డు సమీపంలో చెత్త నుంచి వస్తున్న పొగ

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం రైల్వేకాలనీలో పారిశుద్ధ్య సిబ్బంది తరలించాల్సిన చెత్తకు నిప్పు పెడుతున్నారు. రైల్వేకాలనీలో చెట్లు అధికంగా ఉండటంతో ఆకులు రాలిపోయి, చుట్టుపక్కల వారు వేసిన చెత్తచెదారంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్త చెదారంను శుభ్రం చేసి తరలించాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది వారి సౌలభ్యం కోసం నిప్పు పెడుతున్నారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో పొగ వల్ల వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. అలాగే చెత్తలో ప్లాస్టిక్ తదితర హానికారక వ్యర్థాలు ఉండటంతో పొగ పీల్చడం వల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి సేకరించిన చెత్తను తగులపెట్టకుండా తరలించాలని వారు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి



ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులకు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక దుర్గాపురం సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఎస్ఎఫ్ఐ విజయవాడ సెంట్రల్ నగర మహాసభలు జరిగాయి. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల, రాధానగర్ జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని, సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ మెస్–కాస్మొటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయా లని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాము ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ విజయవాడ సెంట్రల్ నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.ప్రసాద్, బి.మోహన్ మాధవ్ ఎన్నికయ్యారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో బుధవారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ బీఎస్ఎన్ఎల్ ఏపీ సీజీఎం ఎం. శేషాచలంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పుష్పగుచ్ఛంతో అభినందించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ విజయవాడ బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ కె. మురళీకృష్ణ పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం చండీహోమం



మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని శ్రీకనకదుర్గ అమ్మవారి దేవాలయంలో బుధవారం మౌని అమావాస్య పురస్కరించుకుని అంగిరేకుల నాగేశ్వరరావు, గొల్లభామ దంపతుల ఆధ్వర్యాన లోక కల్యాణార్థం చండీహోమం జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణలతో చండీహోమంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎట్టకేలకు గుంతలు పూడ్చారు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): జీవీఆర్‌నగర్ పందిరి రోడ్డులో మురుగుకాలువ పనుల్లో భాగంగా తవ్విన గుంతలను అధికారులు బుధవారం డస్ట్ పోసి పూడ్చివేశారు. ఇక్కడ మురుగు కాలువ పనులు నత్తనడకన సాగుతుండటంతో పాటు తవ్విన గోతులను పూడ్చకపోవడంతో స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షి 'నత్తనకడన మురుగుకాలువ పనులు' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు గోతులు సరిచేయించారు. అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా మాస్టర్ చెఫ్ పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మారుతీనగర్ నారాయణ పాఠశాలలో బుధవారం మాస్టర్ చెఫ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. విద్యా ర్థులు చెఫ్ పోటీల్లో పాల్గొని వివిధ రకాల వంటలు వండి తమ పాకశాస్త్ర ప్రతిభను ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో వంట నైపుణ్యాలు, కలిసికట్టుగా పనిచేయడం, ప్రదర్శన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు చెఫ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ వంటల నైపుణ్యంతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. స్కూల్ జిల్లా ఏజీఎం విజయ, కోఆర్డినేటర్ శ్రావణి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వీఎంసీ సబార్డినేటర్లకు యూనిఫాం పంపిణీ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థలోని అన్ని సెక్షన్లలో విధులు నిర్వహిస్తున్న సబార్డినేటర్లకు యూనిఫాం పంపిణీ చేశారు. ప్రధాన కార్యాలయంలో అధికారులు వారి వద్ద పనిచేసే సబార్డినేటర్లకు బుధవారం యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా వీఎంసీ సబార్డినేటర్ల అసోసియేషన్ అధ్యక్షురాలు శీలం కరుణ మాట్లాడుతూ తమ బాగోగులు చూసుకోవడంలో ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. మగవారికి రెండు జతల చొప్పున ఫ్యాంటూ, చొక్కాకు క్లాత్ అందించారని పేర్కొన్నారు. అలాగే ఆడవారికి రెండు చీరలను అందించారని, ఇందుకు సహకరించిన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్రకు ఆమె అసోసియేషన్ నుంచి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన అవసరం



రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ సువర్ణరాజు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రహదారి భద్రత నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని త్రీటౌన్ ట్రాఫిక్ ఇన్‌చార్జీ సీఐ సువర్ణరాజు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని భాష్యం స్కూల్‌లో బుధవారం రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సువర్ణరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ రోడ్డు భద్రత నియామాలపై అవగాహన ఉంటే చాలా వరకు ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని సూచించారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహతో ఉండాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల వారి విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. రోడ్డు భద్రత నియమాలపై అవగాహన లేకపోవడం, అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం కూడా ఎన్నో ప్రమాదాలకు కారణాలు అవుతున్నాయని అన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే రోడ్డు భద్రత నిబంధనలను పాటించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జె.డి.ఎస్ రాజు, స్కూల్ జెడ్ఈఓ పి.అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): లేడీస్ హాస్టల్‌లో ఉంటూ బ్యాంక్ కోచింగ్ తీసుకుంటున్న యువతి అదృశ్యం అయిన సంఘటనపై తల్లి సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... కృష్ణాజిల్లా మొవ్వ మండలం కొండవరం గ్రామంలో అట్ల శ్రీమన్నారాయణ, రమాదేవి దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె చైతన్య స్వరూప (22) చల్లపల్లిలో డిగ్రీ పూర్తి చేసింది. ఏడాది నుంచి ఆమె విజయవాడ విజయాటాకీస్ వద్ద ఉన్న ఒక లేడీస్ హాస్టల్‌లో ఉంటూ ఒక కోచింగ్ సెంటర్‌లో బ్యాంక్ పరీక్షలకు కోచింగ్ తీసుకుంటుంది. ఈ క్రమంలో ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇప్పుడే క్లాసుకు వెళ్లి వచ్చానని చెప్పింది. ఆ తరువాత వారు కుమార్తెకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. కొంత సేపటి తరువాత మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కంగారుపడ్డ తల్లిదండ్రులు బుధవారం కుమార్తె ఉంటున్న హాస్టల్ వద్దకు వచ్చి హాస్టల్ వార్డెన్‌ను అడగగా మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాలేదని చెప్పింది. దాంతో వారు చుట్టుపక్కల విచారించగా కుమార్తె ఆచూకీ లభించలేదు. అనంతరం బస్టాండ్, రైల్వే స్టేషన్లలో బంధువుల సహాయంతో వెతికినప్పటికీ ఫలితం కనిపించలేదు. ఈ మేరకు తల్లి రమాదేవి సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేటూరి పాట తెలుగు సాహితీ పూలతోట



వేటూరి సుందరరామమూర్తి జయంతి సభలో పాల్గొన్న గొల్ల నారాయణరావు, జయంతి చక్రవర్తి, చిట్టిబాబు

విజయవాడ కల్చరల్: వేటూరి పాట తెలుగు సాహితీ పూలతోట అని పోలవరపు కోటేశ్వరరావు, జీఆర్‌కే సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు గొల్ల నారాయణరావు తెలిపారు. గీతాంజలి మ్యూజిక్స్, జీఎస్ మెలోడీస్, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలోని వేటూరి విగ్రహం వద్ద సినీ గేయ రచయిత వేటూరి సుందరరామమూర్తి 89వ జయంతి బుధవారం నిర్వహించారు. గొల్ల నారాయణరావు మాట్లాడుతూ వేటూరిపాటలో తెలుగు నుడికారాలు కనిపిస్తాయన్నారు. వేటూరి పాటల పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ పరిశోధనా సమయంలో ఆయన అనేక విషయాలను ముచ్చటించే వారని, తెలుగుపాటను శాసించిన ఉత్తమశ్రేణిపాటల రచయిత ఆయన అని అభివర్ణించారు. అతిథులు వేటూరి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, ఆదిరాల జయప్రభ, శ్యాంప్రసాద్, ప్రభల శ్రీనివాస్, కారుమంచి రాజు, చలపతిరావు, రాజ్ కిషోర్ పాల్గొన్నారు.

వేటూరి పాటకు పట్టాభిషేకం

విజయవాడ కల్చరల్: సినీ గేయ రచయిత, సాహితీవేత్త వేటూరి సుందరరామమూర్తి 89వ జయంతి సందర్భంగా సాంస్కృతిక కళాసంస్థల ఐక్యవేదిక, గీతాంజలి మ్యూజిక్స్, జీఎస్ మెలోడీస్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై బుధవారం సినీ సంగీత విభావరి ద్వారా వేటూరి పాటకు పట్టాభిషేకం నిర్వహించారు. అంతర్జాతీయ గాయకుడు దామోదర గణపతిరావు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు జయంతి చక్రవర్తి, వెంకటేశ్వరరావు, రవికుమార్, లక్షణ్ నాయక్, రాజ్ కిషోర్, మునిపల్లె రమణి, రూపశ్రీ, సుహాసిని తదితరులు వేటూరి చిత్రాలు శంకరాభరణం, సిరివెన్నెల, సిరిసిరిమువ్వ, అడవిరాముడు, శుభలేఖ, ప్రతిఘటనతోపాటు 70కి పైగా చిత్రాల్లోని పాటలను మధురంగా ఆలపించారు. వేటూరి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలుగు నాటకం తేజోమయం

ముగిసిన 8వ ఆహ్వాన నాటకోత్సవాలు



ఏసు వెంకట ప్రసాద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: తెలుగు నాటకం తేజోమయమని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్రనాటక కళాసమితి, కొడాలి బ్రదర్స్ ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 8వ ఆహ్వాన నాటకోత్సవాలు బుధవారం ముగిసాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోపాలకృష్ణ మాట్లాడుతూ తెలుగు నాటకానికి పునర్వైభవం తీసుకురావడానికి ప్రభుత్వం ద్వారా కృషి చేస్తున్నట్లు తెలిపారు. న్యాయవాది వేములు హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ రంగస్థల కళాకారుల కోసం సంస్థలు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జానపద గాయకుడు కొమారిపాటి ఏసు వెంకటప్రసాద్‌ను సత్కరించారు. నాటిక ప్రదర్శనలో భాగంగా యస్. రవీంద్రారెడ్డి దర్శకత్వం వహించిన 'ఇది అతని సంతకం' ప్రదర్శించారు. రెండవ నాటికగా 'పేగు రాసిన శాసనం' నాటికను ప్రదర్శించారు. తల్లిదండ్రులు పిల్లల్ని కనిపెంచడం సహజం వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలంటే కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి.. అంతేకాని కన్నమమకారంతో వారిని సరిగా పెంచకపోతే వారి జీవితం దుర్భరమవుతుందనే సందేశంతో నాటిక సాగుతుంది. దర్శకత్వం నాయుడు గోపి, రచన సహకారం చింతకింది శ్రీనివాసరావు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్నాథరావు, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, జయప్రకాష్, నన్నపనేని నాగేశ్వరరావు, బాయన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ ప్రారంభం



కిట్లను అందిస్తున్న ఎంపీ శివనాథ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లాలోని 147 ప్రభుత్వ పాఠశాలలకు తన సొంత నిధులతో ఎనిమిది క్రీడలకు సంబంధించిన క్రీడా వస్తువులతో క్రీడా వికాసం పేరుతో స్పోర్ట్స్ కిట్స్‌ను అందిస్తున్నామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఆయన సొంత నిధులతో విజయవాడ పార్లమెంట నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని కేబీఎస్ కళాశాల ప్రాంగణంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ ప్రస్తుతం విజయవాడ తూర్పు, విజయవాడ సెంట్రల్, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోని 67 ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా వికాసం స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోని గ్రౌండ్స్ అధ్వానంగా తయారై విద్యార్థులు ఆటలకు దూరంగా ఉన్నారన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుల్లోనే కాకుండా ఆటల్లో కూడా బాగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ కార్యక్రమం త్వరలో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో ఉంటుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని తమ ప్రభుత్వం అమలు చేయనుందని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్స హించేందుకు ప్రభుత్వ పాఠశాలల మైదానాలు అభివృద్ధి చేయటంతో పాటు స్పోర్ట్స్ కిట్లను అందించినందుకు ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణరావు, కేబీఎస్ కార్యదర్శి టి.శ్రీనివాసు, నాయకులు ఎంఎస్ బేగ్, ఫతావుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరం



మాట్లాడుతున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి మౌనిక

పాయకాపురం(విజయవాడరూరల్): నేరాల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ట్రైనీ ఐపీఎస్ అధికారి మౌనిక అన్నారు. నున్న పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సురక్ష కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ట్రైనీ ఐపీఎస్ మౌనిక మాట్లాడుతూ సమాజంలో పోలీసు కమ్యూనిటీ పెరగాలని, అందుకు పోలీసు అధికారులకు ప్రజలకు మధ్య వారధిగా సురక్ష కమిటీ సభ్యులు ఉండాలన్నారు. పోక్సో చట్టం పట్ల ప్రజల్లో అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఉందని, చిన్నారులపై అఘాత్యాలు జరగకుండా ఉండేందుకు బ్యాడ్ – గుడ్ టచ్ గురించి పిల్లలకు తెలియజేయాలని అందులో తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గంజాయి లభించే సమాచారం ఎప్పటికప్పుడు పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. ఏసీపీ డాక్టర్ స్రవంతిరాయ్ మాట్లాడుతూ సురక్ష కమిటీ సభ్యులు సమాజానికి ఉపయోగపడే విధంగా పనిచేయాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళాలు సేకరించే విషయంపై మాట్లాడారు. సమావేశంలో నున్న సీఐ పి.కృష్ణమోహన్, ఎస్ఐలు నాగేశ్వరరావు, పండుదొర పాల్గొన్నారు.